క్లుప్తంగా

ఓటర్ల జాబితాను సక్రమంగా పరిశీలించాలి



పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో ఓటర్ల జాబితా సవరణను తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి, వ్యవసాయ అధికారి బి. సాయిశ్రీ గురువారం పరిశీలించారు. ప్రతి ఓటరు వద్దకు వెళ్లి వెరిఫికేషన్ సమగ్రంగా, సక్రమంగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు లిస్టులోని తప్పుల సవరణ, తొలగింపుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఆస్పత్రికి వెళ్లి ఫించన్ అందజేత



కొణిజెర్ల(గంపలగూడెం): ఎన్టీఆర్‌జిల్లా గంపలగూడెం మండలం కొణిజెర్ల సచివాలయ పరిధిలోని వలంటీర్ రాయల వెంకటేశ్వరరావు తన విధుల్లో భాగంగా విజయవాడకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ఫించన్ అందజేశారు. పింఛన్ లబ్ధిదారుడు కటుకూరి జనార్దన్ అనారోగ్యం కారణంగా విజయవాడ హాస్పిటల్లో ఉన్నాడు. దీంతో వలంటీర్ 105 కిలోమీటర్ల దూరంవెళ్లి అతనికి జూలై నెల పెన్షన్ అందించారు. తన అవసరాలకు ఉపయోడపడేలా వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చాడని జనార్దన్ సంతోషం వ్యక్తం చేశారు.

త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా సుంకర సత్యం



మైలవరం: మైలవరం కో–ఆపరేటివ్ సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా సుంకర సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో తాను చేస్తున్న సేవలు గుర్తించి పార్టీ తనకు ఈ బాధ్యతలు అప్పగించిందని, సొసైటీ అభివృద్ధికి, వినియోగదారులు, రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సుంకర అక్కయ్యనాయుడు, బ్యాంక్ జనరల్ మేనేజర్ రంగబాబు, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగులూరి ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

9న మండల పరిషత్ సమావేశం

తిరువూరురూరల్: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు తెలిపారు.

9 నుంచి ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకలు

ఇబ్రహీంపట్నం: ప్రతి గ్రామంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ ముగింపు వేడుకలు ఆగస్టు 9 నుంచి 15వరకు వైభవంగా నిర్వహించాలని ఎంపీడీవో రామకృష్ణ నాయక్ తెలిపారు. ఈ మేరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. జాతీయ ఉపాధి హామీ పథకం, నా భూమి–నా దేశం, నేల తల్లికి, వీరులకు వందనం పేర్లతో కార్యక్రమాలు జరపాలన్నారు. 9న శిలాఫలకాల ఆవిష్కరణ, సెల్ఫీల అప్‌లోడ్, 10న పంచప్రాణ ప్రతిజ్ఞ, సెల్ఫీల అప్‌లోడ్, 11న వసుధకు వందనం, ఫొటోలు అప్‌లోడ్, 14న వీరులకు వందనం, ఫొటోలు అప్‌లోడ్, 15న జాతీయ జెండా ఎగురవేయడం, వందన సమర్పణ, 16న మండలస్థాయి, మునిసిపాలిటీల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు.

ఒంటరి మహిళలకు రేషన్ కార్డుల అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలో నివసిస్తున్న ఒంటరి మహిళలకు మంజూరైన రేషన్ కార్డులను స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అందజేశారు. డివిజన్‌లోని వార్డు సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలకు మంజూరైన కార్డులను అందించామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సర్టిఫికెట్ల కోసం ఆఫీస్‌ల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చే పని లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశామని చెప్పారు.

ప్రజా శ్రేయస్సుకే ‘సురక్ష’

ఎమ్మెల్యే రక్షణనిధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. గురువారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో నెలరోజుల్లో 61,886 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను జారీచేశామన్నారు. తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, తిరువూరు ఎంపీపీ గద్దల భారతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరి బాయి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష



మాట్లాడుతున్న పాలంకి విజయభాస్కరరెడ్డి

మైలవరం: నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రెడ్డిగూడెం మండల జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి తెలిపారు. మైలవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మైలవరం నియోజకవర్గంలో 99,122 కుటుంబాలకు సేవలు అందించడం జరిగిందన్నారు. 77 సురక్షా శిబిరాలు నిర్వహించగా 75,642 వినతులు వచ్చాయని, వీటిలో 73,721 ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 97శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాదరరావు, సర్పంచ్ గరికిపాటి మంజుభార్గవి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, జి.కొండూరు ఎంపీపీ వి. లక్ష్మీతిరుపతమ్మ, ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బహుళ ప్రయోజనాలు



వావిలాలలో సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న సిబ్బంది



నూజివీడులో గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న సీడీపీవో ఎస్వై నూరాని

తిరువూరురూరల్: తల్లిపాల వారోత్సవాలను మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించారు. వావిలాల, మల్లేల, ఎర్రమాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆరోగ్య కార్యదర్శులు తల్లిపాలతో చిన్నారులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రతి గర్భిణి తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషక కిట్లను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహ నాయక్, ఎంపీటీసీ సభ్యురాలు కంచిపోగు లక్ష్మి, ఎర్రమాడు సర్పంచి బొర్రా మాధవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష..

నూజివీడు: తల్లిపాలు బిడ్డకు రక్ష అని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందింపజేయడానికి తల్లిపాలు దోహదపడతాయని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీవో ఎస్వై నూరాని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంతో పాటు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం కిశోరబాలికలకు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగించాలని, దీనివల్ల బిడ్డ అవయవాల ఎదుగుదల సంపూర్ణంగా ఉంటుందన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల మహిళల అందమేమీ తగ్గదని, అలాంటి అపోహలుంటే వాటిని విడనాడి చక్కగా బిడ్డకు పాలివ్వాలన్నారు. కనీసం ఆరు నెలల వయస్సు వచ్చే వరకు పాలివ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవాలని, దీని వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు బిడ్డకు కావాల్సిన పోషకాలు పాల ద్వారా అందుతాయన్నారు.

నూజివీడులో నేడు ప్రారంభం..

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం ప్రారంభిస్తారని సీడీపీవో ఎస్వై నూరాని గురువారం తెలిపారు. పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొనాలని సీడీపీవో విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచారం సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నందిగామ టౌన్: బీఎల్వోలు విధిగా ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించి యాప్‌లో పొందుపరచాలని ఆర్డీఓ రవీంద్రరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివరాల సేకరణ, యాప్‌లో పొందుపర్చటంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కుబడిగా కాకుండా ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ముఖ్యంగా మృతుల ఓటర్ల తొలగించే సమయంలో మరణ ధ్రువీకరణ పత్రం పరిశీలించిన తర్వాతే తొలగించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని వాటిని ఉల్లంఘిస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు

పాయకాపురం(విజయవాడరూరల్): అవయవ దానంపై అవగాహన అవసరమని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూరాజీవ్ నగర్, పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో గురువారం భారతీయ అవయవ దాన దినోత్సవం జరిగింది. వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓపీడీ రోగులకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. మనం మరణించిన తరువాత కూడా అవయవ దానం చేయడం ద్వారా సగటున తొమ్మిది మందికి జీవితాన్ని అందించవచ్చన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్.సి.ఎస్.పి క్యాంప్ ద్వారా ప్రజలకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారితో, ఓపీడీ రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమ అనుసంధానకర్త ఏజీవీ సాయి ప్రసాద్, సంస్థ అధికారులు, సిబ్బంది ఓపీడీ రోగులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించే దిశగా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో రోజుకు 100 కుక్కలను పట్టుకోవాలని, ఆపరేషన్ యూనిట్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు నిర్వహించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆమె గురువారం వీధి కుక్కల సమస్య పరిష్కారానికి వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పెంపుడు కుక్కల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పెంపుడు కుక్కలకు యాంటీరేబీస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) టీకాలు వేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల వారీగా యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) గురించి మైక్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వీధి కుక్కల ప్రేమికులు, కాలనీ ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. హోటళ్లు, మాంసం విక్రేతలపై సక్రమంగా పారేయని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కల సమస్యలకు టోల్–ఫ్రీ నెంబర్ 1800 425 2000 వీఎంసీ, 81819 60909 వీఎంసీ వాట్సాప్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్ర రావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), పుప్పాల కుమారి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, జంతు ప్రేమికులు, జీవకారుణ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు బాబా మందిరంలో సంకట చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం సంకట చతుర్థిని పురస్కరించుకుని మందిరంలోని విజయ వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదోష కాలంలో సంకట చతుర్థి రావటం విశేషమన్నారు. భక్తులు విజయ వినాయకుని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పాఠశాలకు సామగ్రి వితరణ



జి.కొండూరు: కుంటముక్కల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామారావు అదే పాఠశాలకు రూ.10వేలు విలువ గల గ్యాస్‌పొయ్యి, పది కుర్చీలను వితరణగా ఇచ్చారు. ఈ సామగ్రిని గ్రామ సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం షరీఫ్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

విస్సన్నపేట: స్థానిక ఎరువుల విక్రయ దుకాణాలను ఏఓ రాజ్యలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లో అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన ఎరువుల స్టాక్, కంపెనీల ఫామ్స్, కొనుగోలు బిల్లులను పరిశీలించారు. పలు ఎరువుల నాణ్యతను తనిఖీ చేసేందుకు నమూనాలను సేకరించి పరీక్ష కేంద్రానికి పంపినట్లు ఏఓ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: యల్లాపురంలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.కుటుంబరావు గురువారం సాయంత్రం తెలిపారు. నిందితుల నుంచి రూ.2,020 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. వీరిని శుక్రవారం నూజివీడు కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జి.కొండూరు: జి.కొండూరు శివారు గెయిల్ ఇండియా కంపెనీ సమీపంలో రేషన్ బియ్యం లోడుతో గడ్డమణుగు గ్రామం వైపు నుంచి వస్తున్న మినీ ట్రక్కు వాహనాన్ని గురువారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ధర్మరాజు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామానికి చెందిన మల్లవరపు నిఖిల్ అనే వ్యక్తి ఈ ట్రక్కు వాహనంలో 12.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నరసింహుని హుండీ ఆదాయం రూ. 31.72 లక్షలు

వేదాద్రి(జగ్గయ్యపేట): యోగానంద లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల ఆదాయం రూ. 31.72 లక్షల వచ్చిందని ఆలయ ఇన్‌చార్జ్ ఈవో జయ ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గురువారం హుండీలోని కానుకల లెక్కింపు జరిగింది. ఈ ఆదాయం నాలుగు నెలల ఆరు రోజులకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో నందిగామ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన కట్టా నవ్యశ్రీదుర్గ 2019లో శ్రీనివాసమహల్ ప్రాంతానికి చెందిన శ్రీనును ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక పాప సంతానం. మార్బుల్ పని చేసే శ్రీను కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను, పాపను పట్టించుకోవడం లేదు. కొద్ది రోజులుగా శ్రీను వాళ్ల అమ్మానాన్నలకు దగ్గరకు వెళ్లిపోయాడు. కాపురానికి ఇకపై రానని చెబుతూ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

100 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని రెవ. జయపాల్ వితరణతో గురువారం గ్రామంలోని 100 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయపాల్ మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద మహిళల్లో వితంతువులకు ఆరు నెలల పాటు కుట్టు శిక్షణనిచ్చి మిషన్లు అందించామన్నారు. శిక్షణను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలోజయపాల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: ఉద్యాన పంటలు సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని స్థానిక ఎమ్మెల్యే కె. రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో జూపల్లి అయ్యప్ప తోటలో వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మెగా మేళ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు, బిందు సేద్య పరికరాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేసుకునే రైతుల కోసం లక్ష యాభైవేలు మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయిల్‌పామ్, కొబ్బరి సాగు చేసి అధిక లాభాలు పొందాలని ఈ పంటలు ఏలూరు జిల్లాలో అధికంగా సాగు చేస్తున్నారని వీటి వల్ల అక్కడ రైతులు అధిక లాభాలు పొందుతున్నారని వివరించారు. ఈ పంటలు సాగు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం హెక్టారుకు రూ. 71వేలను రాయితీని నాలుగు సంవత్సరాలు పాటు ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సుజాత, జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ సుభానీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి. దామోదర్‌రెడ్డి, డెప్యూటీ జనరల్ మేనేజర్ పతంజలి, జెడ్పీటీసీ భూక్యా గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, సర్పంచులు జూపల్లి రాజేష్, ధారావతు బద్దు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, ఏఓ టిప్పు సుల్తాన్ పలువురు పాల్గొన్నారు.

నిరంతర శిక్షణతో బోధనా సామర్థ్యాలు మెరుగు

ఆగిరిపల్లి (నూజివీడు): ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసన ద్వారా తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకుని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేయొచ్చని ఏపీ రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ బి. విజయభాస్కర్ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని, అందుకు తగ్గట్టుగా బోధనా సామర్థ్యాలను పెంపొందించుకొని విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. గౌరవ అతిథి సీఏ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను, సంక్లిష్టమైన అంశాలను పరిష్కరించగల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కూడా వివిధ అంశాలపై శిక్షణ పొందడం అవసరమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ బి.సాయిబాబు అధ్యక్షత వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో హీల్ ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్సీఈ అధ్యాపకుడికి డాక్టరేట్



ఫణీంద్రను అభినందిస్తున్న కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు ఫణీంద్ర కనకమేడల రాయలసీమ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో ఇంప్రూవ్డ్ అండ్ అడాప్టివ్ సొల్యూషన్స్ ఫర్ రిసోర్స్ ప్రొవిజనింగ్ అండ్ యుటిలైజేషన్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు గురువారం తెలిపారు. ఈ పరిశోధనను డాక్టర్ ఎం. బాబురెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కృష్ణా యూనివర్సిటీ పర్యవేక్షణలో చేశారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ బీ.శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషి చేయాలి



ముసునూరులో శాంతి కోసం ర్యాలీ చేస్తున్న ఫెలోషిప్ ప్రతినిధులు



విస్సన్నపేట క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ

ముసునూరు: మణిపూర్‌లో హింసాకాండలను నిలిపివేసి శాంతి స్థాపనకు కృషి చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రూబేన్, పి.ఏసురత్నం పిలుపునిచ్చారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు నిలిపివేసి శాంతిని స్థాపించాలని కాంక్షిస్తూ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ కార్యక్రమాలు గురువారం మండల కేంద్రం ముసునూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండపం కూడలి వద్ద నుంచి కార్యాలయాల మీదుగా పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలో హింసను ప్రేరేపించడం సహించరాని విషయమన్నారు. మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణ చేయవలసిన అవసరాన్ని తెలుపుతూ శాంతి సందేశాన్ని అందించారు. దేశమంతటా శాంతి వర్ధిల్లడానికి మనమంతా కృషి చేయాలని, క్రైస్తవులు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రెవెన్యూ, పోలీస్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

మహిళలకు రక్షణ కల్పించాలి..

తిరువూరు: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా తిరువూరు పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం బోస్ సెంటర్లో ధర్నా చేశారు. మహిళలకు రక్షణ కల్పించాలని, మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ నాయకులు మాలపాటి ఉదయ్, షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలను నిరసిస్తూ శాంతి ర్యాలీ

విస్సన్నపేట: మణిపూర్‌లో జరిగిన హింసాకాండను నిరసిస్తూ క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల వద్ద నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ గురువారం నిర్వహించారు. క్రైస్తవ సంఘాల, మహిళలు, ముస్లింలు, ప్రజా సంఘాలు, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ లిబరేషన్, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు శాంతి ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

సామాజిక సేవల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి



రోటరాక్ట్ క్లబ్ కార్యవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సామాజిక సేవల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ 14వ ఇన్స్టాలేషన్ ప్రోగ్రామ్ గురువారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. 100 ఏళ్ల చరిత్ర కలిగిన హిందూహైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో తమ కళాశాల కొనసాగుతుందన్నారు. విద్యా వ్యాప్తితో పాటుగా సామాజిక సేవా రంగాల్లోనూ తమ సంస్థలు ముందు వరుసలో ఉన్నాయని చెప్పారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సాకేత్, ఉమామహేశ్వరిలు ఎన్నికయ్యారు. వారితో రోటరీ క్లబ్ నుంచి ప్రతినిధులుగా హాజరైన సాధు వీఆర్ ప్రసాద్, పార్థసారథి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.